సింగిల్ పేజీ కథ

# మిస్డ్ కాల్

**- కె.బి.కృష్ణ**

నేను కొత్తగా ఉద్యోగంలో చేరేక ఆ పట్నంలో గది దొరకడం కష్టమైంది. ఎందుకంటే పెళ్ళికాని అబ్బాయిలకు గది అద్దెకు దొరకడం ఎంత కష్టమో, పెళ్ళికాని నాలాంటి అందమైన అమ్మాయిలకు గది దొరకడం మరీ కష్టం.

కాని నేను పట్టు వదలకుండా వెతుకుతూనే వున్నాను. ఆ రోజు ఆ వీధిలో వెళ్తుంటే, ఒక భవనం గేటు దగ్గర నిలబడి వున్న ఒక పెద్దాయన్ని "సర్ నేను ఇక్కడ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. కొత్తగా వచ్చాను. నాకు ఒక గది కావాలి. త్వరలో మా అమ్మా నాన్నలను తెచ్చుకుంటాను" అన్నాను.

నన్ను ఆయన ఎగాదిగా చూసి -

"అమ్మాయ్. నువ్వు నా కూతురితో సమానం. అందుకని విషయం చెబుతున్నాను. ఈ మధ్యన నా భార్యను నేను మిస్ అయ్యాను. దేముడు మా అనుకూల దాంపత్యాన్ని చూడలేక, ఆమెను అకస్మాత్తుగా మంత్రదండంతో మాయం చేసేశాడు. ఆయన మహామంత్రగాడు కదా; మేడమీద నా పర్సనల్ రూమ్ వుంది. అది నీకు ఇస్తాను. నువు అందులో వుండవచ్చును. అన్ని పనులూ చేయడానికి మనుషులున్నారనుకో అయినా నాకు ఎవరూ లేరనే బాధ వుండదు. పిల్లలంతా విదేశాల్లో వున్నారు. ఇక్కడే మట్టిలో కలిసిపోవాలని నేను వెళ్ళలేదు మరి ఆమె ఇక్కడే వుంది కదా" - అన్నారాయన.

సుమారు అరవై సంవత్సరాలు వుండవచ్చును. అయినా ఆయన చాలా చలాకీగా, ముడతలు పడని ముఖంతో, మంచి శరీర దారుఢ్యంతో వున్నారాయన.

సందేహిస్తున్న నన్ను చూసి -

అమ్మాయి నా వయసు ఇప్పుడు అరవైపైమాటే. నన్ను అనుమానించకు.

"సారీ అంకుల్" అంటూ ఆయన వెంటే లోపలకు వెళ్ళాను. పెద్ద బిల్డింగ్,ఖరీదైనఇంటికి మరింతఖరీదైన ఫర్నిచర్,తదితర సామాగ్రి.

మేడమీద ఒకే ఒక గది. ఆ గదిలో సకల సౌకర్యాలు వున్నాయి.

"అమ్మాయ్ నీ బడ్జెట్‌లో గది అద్దె కోసం ఎంత పైకం అనుకున్నావో అంతే ఇవ్వవచ్చును. నువ్వు అసలు ఇవ్వకపోయినా నేనేం అనుకోను అన్నారాయన అర్థింపుతో.

తొందరలోనే ఆయన నాకు కుటుంబసభ్యుని కన్నా ఆత్మీయులై పోయారు.

ఒక రోజు క్రిందనుండి అంకుల్ మూల్గులు వినిపిస్తుంటే వెళ్ళాను పరుగులతో. బెడ్ మీద అస్తవ్యస్తంగా దొర్లుతూ మూల్గుతున్నారాయన. నన్ను చూడగానే ఆయన చేసిన సైగల ననుసరించి, బెడ్ ప్రక్కనే వున్న టీపాయ్ మీద వున్న బాటిల్‌లో మాత్రలు వేసి మంచినీళ్ళు తాగించాను. ఆయన ఐదునిమిషాలలో కోలుకుని లేచి, ఆందోళనగా ఆయన్ను చూస్తున్న నా తలమీద చేయి వేసి -

"నూరేళ్ళు వర్ధిల్లు తల్లీ. ఇందుకోసమే నిన్ను మేడ మీద గదిలో వుండమన్నాను. అంటూ ప్రశంసాపూర్వకంగా చూశారు నన్ను. ఆయన చేతినుండి, నా కన్న తండ్రి కన్నా మిన్నయైన స్పర్శ ప్రవించింది నా శరీరంలో.

"అంకుల్ ఏ మాత్రం అసౌకర్యంగా వున్నా సరే మరు క్షణంలో మీ తల దగ్గర వున్న సెల్‌లో నాకు మిస్‌డ్‌కాల్ చెయ్యండి. వెంటనే వచ్చేస్తాను. ఓకే-" అంటూ ఆయన పాదాలు స్పృశించి మేడమీద గదికి వచ్చేసాను.

బాగా నిద్ర పట్టేసింది. సెల్‌లో టంగ్ టంగ్‌మని శబ్దం, చూస్తే మిస్‌డ్‌కాల్ అని వుంది, చూస్తే అంకుల్‌దే అరే - ఇంతలో ఎంత నిద్ర పట్టేసింది. అనుకుంటూ పరుగులతో క్రిందకు వెళ్ళాను.

అంకుల్ గుండెలమీద ఆమె ఫోటో. ఫోటో మీద రెండు చేతులూ పెట్టుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారు. అమ్మయ్య అనుకుని చెయ్యి పట్టుకున్నాను. మంచుకన్నా చల్లగా వుంది. ఆయన గుప్పెట్లో స్లిప్ అందులో "అమ్మాయ్ వీళ్ళందరకూ ఫోన్లు చెయ్యి" అని గజిబిజిగా రాసి వుంది.

నిశ్చేష్టి అయ్యాను. ఒక్క క్షణం తరువాత అందరికీ ఫోన్లు చేశాను మా అమ్మా నాన్నలతో సహా. స్థానికంగా ఆయన స్నేహితులు కూడా వచ్చారు.

సెల్‌లో రింగ్ టోన్ వచ్చినప్పుడు మెలకువగా వుండి వుంటే, అంకుల్‌ని మిస్ అయి వుండే దాన్ని కాదు. కాని నా జీవితంలో మరిక అందుకోలేని మిస్‌డ్‌కాల్ అయిపోయారు అంకుల్ !


**విపులకు** సాహిత్య మాసపత్రిక

**చదవండి! చదివించండి!**

చందాదారులు కండి!

సంవత్సర చందా రూ. 120/-

విశిష్ట చందా రూ. 3000 /-